## శ్రీ పయ్యావుల కేశవ్

## గౌరవనీయ ఆర్థిక శాఖామాత్యుల వారి ప్రసంగం

## నవంబరు 11, 2024

**గౌరవనీయ అధ్యక్షా!**

2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను మన రాష్ట్ర వార్షిక బడ్జెట్‌ను మీ అనుమతితో గౌరవ సభ ముందు ప్రతిపాదిస్తున్నాను.

2. ఈ రోజు నేను ప్రవేశపెడుతున్న బడ్జెట్ ప్రతిపాదనల ప్రాముఖ్యత అంకెలకు మించినది. మన రాష్ట్రాన్ని కాపాడాలని అపూర్వమైన తీర్పును ఇచ్చిన ప్రజల సంకల్పానికి ఇది ప్రతిబింబం. ప్రభుత్వం ఏర్పడిన వెంటనే గత ప్రభుత్వ దుష్పరిపాలన వలన మన రాష్టానికి జరిగిన నష్టాన్ని ప్రజలకు తెలియజేయడం మా ప్రభుత్వ నైతిక కర్తవ్యం. మా ప్రభుత్వం వెలువరించిన ఏడు శ్వేతపత్రాల ద్వారా ఇది జరిగింది. సమిష్టి అవగాహనకు అవసరమైన అంశాలపై బహిరంగ చర్చను ప్రోత్సహించడం, రాష్ట్ర పునర్‌నిర్మాణ ప్రక్రియలో మద్దతు కూడగట్టడం వీటి ఉద్దేశ్యం. ఈ రోజు మన రాష్ట్రం ఎదుర్కొంటున్న సవాళ్ళు:

- రాష్ట్ర ఆర్థిక వ్యవహారాల దుర్వినియోగం;
- రాష్ట్ర వనరుల మళ్లింపు;
- లోపభూయిష్టమయిన ఎక్సైజ్ మరియు ఇసుక విధానాల వలన సహజవనరుల దోపిడీ వలన రాష్ట్ర ఆదాయానికి గండిపడడం;

- ప్రభుత్వ పన్నులను దారి మళ్లించడం ద్వారా రాబోయే 25 సంవత్సరాల భవిష్యత్తు ఆదాయాన్ని గణనీయంగా తగ్గించడం;
- పరిమితికి మించి రుణాలను అధిక వడ్డీ రేట్లకు తీసుకోవడం;
- కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలను ఉల్లంఘించి రుణాలు తీసుకోవడం;
- కేంద్ర ప్రాయోజిత పథకాల నిధుల మళ్లింపు;
- పిల్లల పౌష్టిక ఆహారం కోసం చిక్కి, వైద్య సామాగ్రి వంటి ముఖ్యమైన పథకాలకు చెల్లింపుల నిలుపుదల;
- స్థానిక సంస్థల నిధుల మళ్లింపు;
- ఉద్యోగులకు పేరుకుపోయిన బకాయిలు;
- వివిధ పనులకు చెందిన బిల్లుల బకాయిలు;
- అన్ని ప్రాజెక్టులను స్తంభింపజేయడం ద్వారా నీటిపారుదల రంగ పతనం;
- ఇంధన రంగ విధ్వంసం;
- కొత్తగా బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ ఏర్పాటు ద్వారా కార్పొరేషన్ల నిధుల మళ్లింపు;

పైన పేర్కొన్న కారణాల వలన దేశంలోనే తొలిసారిగా ఆర్థిక గందరగోళ పరిస్థితులు ఎదురయ్యాయి. కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ వారి నివేదికలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై ప్రతికూలంగా వ్యాఖ్యానించడం జరిగింది. నేడు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ పతనం అంచున ఉంది. మన రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను పునఃప్రారంభించి రాష్ట్ర ప్రగతిని పునర్నిర్మించడం ఇప్పుడు నేటితరం

చేతులలో ఉంది. గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడుగారి ప్రేరణే మాకు చోదక శక్తి. ఈ సందర్భంగా వారి మాటలను నేను ఉదహరించాలని అనుకుంటున్నాను.

**"ప్రతీ సంక్షోభాన్నీ అంకితభావంతో, సృజనాత్మకతతో నిబద్ధత మరియు కృషితో అవకాశంగా మార్చుకోండి."**

3. 2024 మే-జూన్ నెలలలో జరిగిన సార్వత్రిక మరియు రాష్ట్ర శాసనసభ ఎన్నికలలో మన రాష్ట్ర ప్రజలు మా సంకీర్ణ ప్రభుత్వానికి అపూర్వమైన తీర్పును ఇచ్చారు. 57 శాతం ఓట్లతో, 175 సీట్లకుగాను 164 సీట్లు రావడం మాకు దక్కిన గౌరవం. అసాధారణమైన ఆధిక్యతతో 93 శాతం సీట్లను మేము గెలవగలిగాము. గత ప్రభుత్వ దుర్మార్గపు పాలనకు వ్యతిరేకంగా ప్రజలు చేసిన విప్లవ ప్రకటన ఇది. అదే సమయంలో, మా ఎన్.డి.ఎ. ప్రభుత్వానికి లభించిన అద్భుతమైన ఈ ఆధిక్యత, గౌరవనీయ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడుగారు, గౌరవనీయ ఉపముఖ్యమంత్రి శ్రీ కొణెదల పవన్ కళ్యాణ్‌గారు మరియు గౌరవనీయ భారత ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోడీగారి నాయకత్వం మరియు ప్రతిభపై ప్రజలకు ఉన్న నమ్మకానికి నిదర్శనం.

4. గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడుగారి నాయకత్వానికి, దూరదృష్టికి, మరియు ప్రజాసేవ పట్ల ఆయనకున్న అంకితభావానికి, మన రాష్ట్ర ప్రజలు ఆయన మీద ఉంచిన అపరిమిత విశ్వాసానికి ఈ విజయం ఒక తార్కాణం. మన రాష్ట్ర అభివృద్ధి కోసం ఆయన ఎల్లప్పుడూ కృషి చేస్తూనే ఉన్నారు. తన అద్భుతమైన పనితీరు, నిజాయితీ మరియు సాంకేతికత పట్ల ఉన్న సమగ్ర అవగాహన, ఆధునికీకరణ మరియు

సాంకేతిక ఆధారిత భవిష్యత్తు కోసం వారు చూపిన దార్శనికత వారి పేరుతోపాటు మన రాష్ట్ర ప్రతిష్ఠను కూడా పెంపొందింపజేసాయి. మన గౌరవ ముఖ్యమంత్రిగారు 1995లోనే ఆర్థిక మంత్రిగా తన తొలి బడ్జెట్ ప్రసంగంలో ఇలా అన్నారు...

> **"అభివృద్ధి సాధించాలంటే సామర్థ్యంతో కూడిన అమలు పరిచే విధానాలుంటే తప్ప ప్రయోజనం గల ఫలితాలు సాధించలేము. ప్రపంచ వ్యాప్తంగా సాగుతున్న 'సమాచార విప్లవం' వలన కలిగిన లాభాలను మరియు అవకాశాలను వినియోగించుకోవడానికి వీలుగా మా పాలనా యంత్రాంగాన్ని పునర్ వ్యవస్థీకరించాలన్నది మా ఆశయం. పరిపాలనకు చెందిన అన్ని రంగాలలోనూ కంప్యూటర్‌ల వినియోగానికి ఒక బృహత్ కార్యక్రమాన్ని చేపట్టాలని భావిస్తున్నాము."**

5. ఆయన పరిపాలనా అనుభవంలోని మైలురాయి అంశాలు ఇప్పుడు చెప్పబోయే విషయాలను నిర్ధారిస్తాయి. 1995 నుండి 1999 వరకు ముఖ్యమంత్రిగా ఆయన మొదటి పదవీకాలం గణనీయమైన ఆర్థిక సంస్కరణలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి మరియు సమాచార సాంకేతిక పరిశ్రమల అభివృద్ధితో గుర్తింపు పొందింది. ఆయన ప్రగతిశీల నాయకత్వంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ దేశానికే చక్కటి అభివృద్ధి నమూనాగా నిలిచింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని వ్యవసాయ ఆధారిత రాష్ట్రం నుంచి సాంకేతిక పరిజ్ఞానానికి మూల స్థంభంగా మరియు సమాచార సాంకేతిక సేవల కేంద్రంగా మార్చడంలో ఆయన కీలక పాత్ర పోషించారు. ఆయన చేపట్టిన అనేక విధానాలు మరియు పాలనా కార్యక్రమాలు తర్వాతి కాలంలో జాతీయ విధానాలుగా కూడా రూపుదిద్దుకున్నాయి. **'రేపటి రోజున దేశం చేసే**

**ఆలోచనను, ఆంధ్రప్రదేశ్ ఈ రోజే చేస్తుంది'** అనే పేరును తీసుకొచ్చారు. ప్రస్తుతం అభివృద్ధి చెందుతున్న సాఫ్ట్‌వేర్ పరిశ్రమకు హైదరాబాద్‌లో ఆనాడే పునాది వేయడం ద్వారా హైదరాబాద్‌ను ప్రపంచ సమాచార సాంకేతక పటంలో అగ్ర స్థానానికి చేర్చటంలో కూడా ఆయన పాత్ర మరువలేనిది. ఇంజినీరింగ్ కళాశాలలు మరియు సమాచార సాంకేతిక రంగాలలో ఆయన చేసిన విధానపరమైన నిర్ణయాలు మన రాష్ట్ర ప్రజలకు ప్రపంచ వ్యాప్తంగా అవకాశాలు కల్పించాయి. ఈ కారణంగా గ్రామీణ ప్రాంతాలకు చెందిన సామాన్య ప్రజలు సైతం ప్రపంచవ్యాప్తంగా విజయ శిఖరాలను అధిరోహించ గలిగారు. నేడు అమెరికాతో పాటు అనేక ఇతర దేశాలలో ప్రవాసాంధ్రులు అత్యధిక తలసరి ఆదాయం కలిగినవారుగా స్థిరపడ్డారు.

6. 2014 జూన్ నెలలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ను అన్యాయంగానూ, అశాస్త్రీయంగానూ మరియు అప్రజాస్వామికంగానూ ఒక శాశ్వత రాజధాని లేకుండా విభజించడం వలన మన రాష్ట్రం సంక్షోభంలో కూరుకుపోయి, ఆర్థికంగా నిలదొక్కుకోలేని అవశేష రాష్ట్రంగా ఉండిపోయింది. రాష్ట్ర విభజనను మన రాష్ట్ర ప్రజలపై బలవంతంగా రుద్దారని చెప్పడం ఎంత మాత్రం తప్పకాదు. మన రాష్ట్రాన్ని పునర్నిర్మాణ దిశగా మరియు సుసంపన్నదిశగా తీసుకువచ్చే బాధ్యతను మన నాయకుడు, గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడుగారు తన భుజస్కంధాలపై వేసుకున్నారు. ఆయన పరివర్తనాత్మక నాయకత్వంతో దీర్ఘకాలిక మరియు స్వల్పకాలిక ప్రణాళికలను అమలుచేసి అవశేష రాష్ట్రాన్ని విభజన దుష్ప్రభావం నుండి తప్పించి అభివృద్ధి పథంలో నడిపించారు.

7. 2014 నుండి 2019 వరకు వ్యవసాయం, పరిశ్రమలు, సేవలు, నీటిపారుదల, రోడ్లు భవనాలు, ఉపాధి కల్పన తదితర రంగాలలో బహుముఖ వ్యూహాన్ని రూపొందించారు. కియా మోటార్స్, హీరో మోటార్స్, ఏషియన్ పెయింట్స్ వంటి భారీ పరిశ్రమలను మన రాష్ట్రం ఆకర్షించింది. పట్టిసీమ ఎత్తిపోతల పథకం దేశంలోనే రికార్డు సమయంలో అనగా కేవలం ఏడాది కాలంలోనే పూర్తి అయిన **తొలి నదుల అనుసంధాన ప్రాజెక్టుగా** రికార్డు సృష్టించింది. సులభతర వ్యాపార నిర్వహణా ర్యాంకింగ్‌లో మన రాష్ట్రం మొదటి స్థానం సాధించి ఆ ఐదేండ్లలో అగ్రస్థానంలో నిలిచింది. ఇంధన రంగంలో సంస్కరణలు తీసుకురావడంతో పాటు పునరుత్పాదక ఇంధనాన్ని ప్రోత్సహించడం ద్వారా 2018 జనవరి నాటికి మన రాష్ట్రం ఇంధన మిగులు రాష్ట్రంగా నిలిచింది. నాటి బహుముఖ వ్యూహం ఫలితంగా మన రాష్ట్రం సంక్షేమంతో కూడిన సుస్థిర ఆర్థికాభివృద్ధి పథంలో పయనించింది.

8. 2019 తర్వాత జరిగిన పరిణామాలు మన రాష్ట్ర చరిత్రలో ఒక చీకటి దశగా చెప్పుకోవచ్చు. 2014-19 మధ్య కాలంలో జరిగిన ఆర్థికాభివృద్ధి వృదా అయింది. గత ప్రభుత్వం 2019లో తన పదవీ కాలాన్ని ఎంతో విధ్వంసకర ధోరణితో ప్రారంభించింది. ప్రజావేదికను కూల్చివేసింది. విద్యుత్ కొనుగోలు ఒప్పందాలను రద్దు చేసింది. మూడు రాజధానుల నమూనాతో ప్రజలను అయోమయానికి గురిచేసింది. పారిశ్రామిక వ్యతిరేక విధానాన్ని అనుసరించింది. పెట్టుబడిదారుల విశ్వాసాన్ని మరియు మన రాష్ట్ర బ్రాండ్ విలువను దెబ్బతీసింది. నీటి పారుదల రంగాన్ని పూర్తిగా విస్మరించింది. కేంద్ర ప్రభుత్వ అభిప్రాయానికి విరుద్ధంగా కార్యనిర్వాహక సంస్థను మార్చడం ద్వారా

పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని నిలిపివేసింది. ఈ చర్యల వలన డయాఫ్రమ్ గోడకు నష్టం కలిగి ప్రాజెక్టు జాప్యానికి దారితీసింది. పన్నులు చెల్లిస్తూ మరియు ఉపాధి కల్పిస్తూ రాష్ట్రాభివృద్ధికి దోహదపడే పరిశ్రమలు మన రాష్ట్రాన్ని వదిలి వెళ్ళి పోయాయి. ఈ చర్యలు పెట్టుబడిదారులను మరియు ప్రపంచ ఆర్థిక సంస్థలను రాష్ట్రంలో స్థిరమైన పెట్టుబడులు పెట్టనివ్వకుండా చేసాయి. ఫలితంగా మన రాష్ట్ర ఆర్థికస్థితి విచ్ఛిన్నమైంది.

ఈ సందర్భంలో **కౌటిల్యుడి** మాటలు ఒకసారి గుర్తుచేసుకుందాం.

**"సంపదకు మూలం ఆర్థిక కార్యకలాపాలే....**
**అవి లేకపోవడం వనరుల సమీకరణకు ఇబ్బందులను తెచ్చిపెడుతుంది...**
**ఫలవంతమైన ఆర్థిక కార్యకలాపాలు లేకపోతే,**
**ప్రస్తుత శ్రేయస్సు మరియు భవిష్యత్ వృద్ధి రెండూ నాశనమయ్యే ప్రమాదం ఉంది."**

9. ద్రవ్యం చలామణిలో ఉన్నప్పుడే ఆర్థిక వ్యవస్థలో సంపద సృష్టి జరుగుతుంది. ఇది జరగాలంటే ప్రాజెక్టుల అమలు తప్పనిసరి. కానీ, గత ప్రభుత్వం ఉత్పాదక మూలధన వ్యయాన్ని నిలిపివేయడం ద్వారా 2014-19 సంవత్సరాల మధ్య అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాలలో ఒకటిగా ఉన్న మన రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ 2019-24 సంవత్సరాల మధ్య గడ్డు స్థితికి చేరుకోవడానికి కారణమయింది. గత ప్రభుత్వం రాష్ట్ర వనరుల దుర్వినియోగం మరియు నిధులను ప్రక్క దారి పట్టించడం వంటి చర్యలతో పేలవమైన పాలన చేయడం జరిగింది. కేంద్ర ప్రాయోజిత పథకాల నిధులను దారి మళ్ళించడమేకాక, అందుకు సరిపోయే రాష్ట్ర వాటాను కూడా విడుదల

చేయలేదు. కార్పొరేషన్ల నిధుల మళ్లింపు, రాష్ట్ర ఆర్థిక వ్యవహారాల దుర్వినియోగం వంటి చర్యలు అధిక రుణ భారానికి దారితీసాయి. ప్రభుత్వ ఆస్తులను తాకట్టు పెట్టడం, స్థానిక సంస్థల నిధుల మళ్లింపు వంటి చర్యలకు పాల్పడటంతోపాటు బిల్లుల చెల్లింపుల కోసం ప్రభుత్వానికి వ్యతిరేకంగా వ్యాజ్యాలు వేయడం వలన గుత్తేదారులకు నమ్మకం లోపించి ప్రభుత్వంపై విశ్వాసం సన్నగిల్లింది. గత ప్రభుత్వం అధికారం నుండి వైదొలిగేనాటికి మన రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ పతనం అంచున ఉంది. ఉద్యోగులకుగానూ 21,980 కోట్ల రూపాయల బకాయిలు, కేంద్ర ప్రాయోజిత పథకాలకు 4,657 కోట్ల రూపాయల బకాయిలతో సహా మొత్తం 1,35,224 కోట్ల రూపాయల బకాయిలు ఉన్నాయని శ్వేతపత్రంలో ఇప్పటికే పేర్కొన్నాం. ఇవన్నీ గత ప్రభుత్వ దుష్పరిపాలనకు, వైఫల్యాలకు నిదర్శనం.

10. 2019-24 సంవత్సరాల మధ్య కాలంలో నెలకొన్న పరిస్థితి చూస్తే మన రాష్ట్రం పటిష్టమైన ఆర్థిక సూత్రాలతో నడిచిందా? లేక వ్యక్తిగత ప్రయోజనాల కోసం లాభాపేక్షతో ఒక ప్రైవేటు సంస్థలాగా నడిచిందా? అనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. గత ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని ప్రక్కన పెట్టి కేవలం ప్రైవేటు లాభం అనే భావనతోనే నడిచింది. సహజ వనరులను కొల్లగొట్టడం, సహజ ఖనిజాల అక్రమ తవ్వకాలతో రాష్ట్ర ఖజానాకు ఆదాయ నష్టం కలిగించడం, వ్యక్తిగత ప్రయోజనాల కోసం ఉద్దేశ్య పూర్వకంగా ఇసుక మరియు ఎక్సైజ్ విధానాలను రూపొందించడం జరిగింది. ఈ చర్యల వలన ఒకవైపు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ క్షీణించగా, మరోవైపు అధిక పన్నులు మరియు దుష్పరిపాలన కారణంగా రాష్ట్ర ప్రజల కష్టాలు మరింత పెరిగాయి. గత

ప్రభుత్వం ప్రజాస్వామిక గొంతులను అణచివేయడం మరియు ప్రజాస్వామ్య వ్యవస్థలను దెబ్బతీయడం వంటి కక్షసాధింపు చర్యలకు పాల్పడింది.

11. గత ప్రభుత్వ దుష్పరిపాలనకు వ్యతిరేకంగా వివేకవంతమైన ప్రజాస్వామిక నిర్ణయం తీసుకొని, మరోసారి రాష్ట్ర చరిత్ర గతిని సవ్యదిశగా మార్చిన మనరాష్ట్ర ప్రజలకు కృతజ్ఞతలు తెలియ జేసుకుంటున్నాను. మన రాష్ట్ర ప్రజలు విజ్ఞతతో ఇచ్చిన తీర్పు 2024లో ఎన్.డి.ఎ. కూటమి తిరిగి అధికారంలోకి వచ్చేందుకు దోహదపడింది. శ్రీ నారా చంద్రబాబు నాయుడుగారు నేడు రెట్టించిన ఉత్సాహం మరియు దృఢ సంకల్పంతో ఉన్నారు. స్వర్ణాంధ్రప్రదేశ్ విజన్‌కు 2024 సంవత్సరం ఒక మైలురాయి వంటిది.

12. మా ప్రభుత్వం ఎన్ని సవాళ్ళు ఎదురైనా ఇచ్చిన హామీలను నెరవేర్చడానికి గౌరవ ముఖ్యమంత్రి గారి నాయకత్వంలో కృషి చేస్తోంది. ఈ రోజు నేను ప్రవేశపెడుతున్న బడ్జెట్ ప్రతిపాదనలు రాష్ట్ర ఆర్థిక నేపథ్యాన్ని దృష్టిలో ఉంచుకొని మరియు ఆర్థిక పునరుజ్జీవనమే లక్ష్యంగా మరియు సంపదను సృష్టించే విధంగా అభివృద్ధి చక్రాన్ని పునఃప్రారంభించాలనే ఉద్దేశ్యంతో రూపొందించబడినవి. అన్ని శాఖలకు కేటాయింపులు ప్రతిపాదించే ముందు, మా ప్రభుత్వానికి మార్గదర్శకంగా నిలిచిన స్వర్గీయ శ్రీ ఎన్.టి. రామారావు గారి మాటలను నేను గుర్తు చేసుకోవాలనుకుంటున్నాను.

**"సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు"**

**వ్యవసాయం మరియు అనుబంధ రంగాలు**

ఈ సందర్భంగా నాకు తెలుగు పునరుజ్జీవనోద్యమ పితామహుడిగా పేరొందిన శ్రీ కందుకూరి వీరేశలింగంగారి ఆలోచనలు గుర్తుకొస్తున్నాయి.

**"వ్యవసాయం చేసే చేతులకు మనం సాయం చేయాలి.**
**అదే దేశ సౌభాగ్యానికి మార్గం."**

మా ప్రభుత్వానికి వ్యవసాయ రంగ అభివృద్ధి మరియు రైతుల సంక్షేమమే అత్యంత ప్రాధాన్యము. మా వ్యవసాయ శాఖా మంత్రిగారు 2024-25 వ్యవసాయ బడ్జెట్‌ను ప్రవేశపెట్టేటప్పుడు వ్యవసాయాభివృద్ధికి మా ప్రభుత్వం చేపట్టిన వివిధ కార్యక్రమాల గురించి వివరిస్తారు.

13. **'సూపర్ సిక్స్'** హామీలలో భాగంగా మా ప్రభుత్వం **'అన్నదాత సుఖీభవ-ప్రధానమంత్రి కిసాన్ పథకం'** ద్వారా అర్హులైన రైతులకు పెట్టుబడి సాయం ప్రకటించింది. మా ప్రభుత్వం రైతుల సమగ్ర అభివృద్ధికి **పొలం పిలుస్తోంది, వడ్డీ లేని రుణాలు, భూసార కార్డుల పంపిణీ, వ్యవసాయ పనిముట్ల సరఫరా, భూసార పరీక్షల ప్రయోగశాలలు, పొలంబడి వంటి పథకాలను** అమలు చేస్తోంది. 2024-25 ఆర్థిక సంవత్సరం రబీ కాలం నుండి పంటల బీమా పథకాన్ని సవరించడం మరియు స్వచ్ఛంద నమోదు నమూనాను అవలంబించడం వలన, రైతులు వారి వారి వ్యక్తిగత అవసరాల ఆధారంగా ఈ పథకాలలో పాల్గొనే స్వేచ్ఛను మరియు వెసులుబాటును కల్పించడం జరిగింది.

14. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ స్థూల విలువను పెంచడంలో పశుసంవర్ధక రంగం కీలక పాత్ర పోషిస్తుంది. పశుసంపద మరియు కోళ్ళ పెంపకంలో మన రాష్ట్రం దేశంలోనే రెండో స్థానంలో ఉంది. మన రాష్ట్రం గుడ్ల ఉత్పత్తిలో

మొదటి స్థానంలోనూ, మాంసం ఉత్పత్తిలో 4వ స్థానంలోనూ మరియు పాల ఉత్పత్తిలో 5వ స్థానంలోనూ ఉంది. వివిధ పథకాల క్రింద పశువులకు ఆశ్రయం, గ్రాసం మరియు వైద్య సహాయం అందించడం ద్వారా పశు సంపదను పెంచుతూ పశువులకు రక్షణ మరియు సంరక్షణ కలిగించాలని మా ప్రభుత్వం తీర్మానించుకుంది. పశువుల ద్వారా జీవనోపాధి పొందుతున్న యాదవులు, కురబలు, కురుమలు మరియు ఇతర వర్గాల ఆదాయాన్ని పెంచడానికి మా ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది. పశు బీమా పథకాన్ని అమలు చేయడం ద్వారా ప్రభుత్వం ఈ వర్గాల జీవనోపాధికి రక్షణ కల్పిస్తోంది.

15. సాంప్రదాయ మత్స్యకారులు చేపల చెరువులను లీజుకు తీసుకోకుండా గత ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దశాబ్దాలుగా చేపల చెరువులపై ఆధారపడి జీవనం సాగిస్తున్న మత్స్యకారుల ప్రయోజనాలను పరి-రక్షించడానికి, మా ప్రభుత్వం ఆ ఉత్తర్వులను ఉపసంహరించింది. 23 వేల చేపల వేటకు అనువైన బోట్లకు మా ప్రభుత్వం రాయితీపై డీజిల్‌ను అందిస్తోంది.

16. వ్యవసాయం మరియు అనుబంధ రంగాలను ప్రోత్సహించడంలోనూ మరియు గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిలోనూ సహకార రంగం కీలక పాత్ర పోషించే సామర్థ్యాన్ని కలిగి ఉంది. ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలను కంప్యూటరీకరణ చేయుడం ద్వారా బలోపేతం చేసి రైతుల ఆర్థిక సమీకరణను పెంచడం జరుగుతోంది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో వ్యవసాయం మరియు అనుబంధ రంగాలకు 11,855 కోట్ల రూపాయల కేటాయింపును ప్రతిపాదిస్తున్నాను.

## సంక్షేమం

మన గౌరవ ముఖ్యమంత్రిగారు సంక్షేమం గురించి ఇలా అంటుంటారు.

**"ప్రజలు ఎల్లప్పుడూ సంక్షేమం, అభివృద్ధి మరియు సుపరిపాలనను కోరుకుంటారు. వాటిని అందిస్తున్నంత కాలం ప్రజలు మనతోనే ఉంటారు".**

17. సంక్షేమం మరియు అభివృద్ధిని సమతుల్యం చేయాలనే వారి విశ్వాసం మూడు దశాబ్దాల క్రితం 1995లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక మంత్రిగా ఆయన చేసిన తొలి బడ్జెట్ ప్రసంగం నుంచే స్పష్టమవుతోంది. "స్థూలంగా చెప్పాలంటే మా ప్రభుత్వ ప్రధాన ఆశయం పేదరిక నిర్మూలన. బడుగుల సంక్షేమమే మా పరమావధి. పేదల సంక్షేమానికి మా ప్రభుత్వం సర్వదా అంకితం. అంత మాత్రాన రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి కుంటు-పడనిస్తామని అనుకోవద్దు. ఆ పని ఎప్పటికీ జరగదు. నిధుల కొరత కారణంగా ఏ అభివృద్ధి కార్యక్రమం కుంటుపడరాదన్నది మా ధ్యేయం. అలా కుంటుపడకుండా కృషి చేస్తాం."

18. విద్యాభివృద్ధి, సామాజిక ఆర్థికాభివృద్ధి, సంక్షేమం మరియు హక్కుల పరిరక్షణ కోసం వివిధ పథకాలను అమలు చేయడం ద్వారా అన్ని సామాజిక వర్గాల అభివృద్ధికి మా ప్రభుత్వం కట్టుబడి ఉంది. సంక్షేమానికి పెద్దపీట వేస్తూ **స్వర్ణాంధ్ర-2047** దిశగా మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలకు అనుగుణంగా మాప్రభుత్వం ఎన్నో పథకాలను రూపొందిస్తోంది. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు అధికారం చేపట్టిన వెంటనే సామాజిక భద్రత పింఛన్‌ను 3 వేల

రూపాయల నుండి 4 వేల రూపాయలకు పెంచడం జరిగింది. **ఎన్.టి.ఆర్. భరోసా పింఛను పథకం** ద్వారా 64.38 లక్షల మంది పింఛనుదారులకు నెలకు 4 వేల రూపాయల నుండి 15 వేల రూపాయల వరకు పింఛన్లు అందుతున్నాయి. మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి నెలలోనే **ఎన్.టి.ఆర్. భరోసా పథకం** క్రింద 4,400 కోట్ల రూపాయలు, అలాగే 2024 జూన్ నుండి ఇప్పటి వరకు మొత్తం 15,218 కోట్ల రూపాయలు విడుదల చేయబడ్డాయి. కళాశాలల నుంచి ధృవపత్రాలు పొందేందుకు విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు మెట్రిక్ అనంతర ఉపకార వేతనాలను (ఆర్.టి.ఎఫ్) ప్రభుత్వం నేరుగా కళాశాలల ఖాతాలలోకే విడుదల చేస్తోంది. గత ప్రభుత్వం మిగిల్చిన పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను కూడా దశలవారీగా విడుదల చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. మా ప్రభుత్వ పథకాలు మాల, మాల దాసరి, మేడిగ, రెల్లి, అరుంధతీయ మరియు ఇతర షెడ్యూల్డ్ కులాల వర్గాలకు మేలు చేస్తాయి.

19. రజకులు, దూదేకులు, నాయీబ్రాహ్మణులు వంటి సంప్రదాయ వృత్తి సమూహాలకు ఆధునిక వృత్తి పద్ధతుల ద్వారా వారి జీవనోపాధిని పెంపొందించడానికి ఆర్థిక సహాయం అందించాలని ప్రతిపాదించబడింది. సంప్రదాయకంగా నైపుణ్యం కలిగిన నేత కార్మికులకు వారి నైపుణ్యాలను మెరుగుపరచడానికి వీలుగా ఆర్థిక సహాయం కూడా అందించబడుతోంది. మా ప్రభుత్వ పథకాలు వడ్డెర, వాల్మీకి, గౌడ, కళింగ, గవర, పద్మశాలి, బెస్త, సగర, ఉప్పర తదితర వెనుకబడిన వర్గాలకు లబ్ధి చేకూరుస్తాయి.

20. షెడ్యూల్డ్ తెగల కుటుంబాల సాధికారతకు మా ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉంది. గిరిజన వర్గాల సంక్షేమం కోసం పోస్ట్ మెట్రిక్ ఉపకార వేతనాలు-ఆర్.టి.ఎఫ్, ఎం.టి.ఎఫ్., అంబేద్కర్ విదేశీ విద్యానిధి మొదలైన ముఖ్య పథకాలను అమలు చేయడం జరుగుతోంది. గిరిజన ప్రాంతాలలో మౌలిక సదుపాయాల అంతరాలను పూడ్చడంతో పాటు నాణ్యమైన విద్య, పౌష్టిక ఆహారం, ఆరోగ్య సంరక్షణ మరియు గిరిజన వర్గాల ఆర్థికాభివృద్ధిపై కూడా మా ప్రభుత్వం ప్రత్యేక దృష్టిని సారించనుంది.

21. వివిధ పథకాల ద్వారా అల్పసంఖ్యాక వర్గాలకు ఆర్థిక కార్యకలాపాల లోనూ మరియు ఉపాధి కల్పించడంలోనూ సమాన భాగస్వామ్యం లభించేలా మా ప్రభుత్వం చూస్తోంది. వారి విదేశీ విద్యకు అలాగే ఇమామ్‌లకు, మౌజాములకు మరియు పాస్టర్‌లకు ప్రోత్సాహకాలు ఇవ్వాలని ప్రతి-పాదించడం జరిగింది.

22. 2024-25 ఆర్థిక సంవత్సరంలో షెడ్యూల్డ్ కులాల కాంపోనెంట్‌కు 18,497 కోట్ల రూపాయలు, షెడ్యూల్డ్ తెగల కాంపోనెంట్‌కు 7,557 కోట్ల రూపాయలు, వెనుకబడిన తరగతుల కాంపోనెంట్‌కు 39,007 కోట్ల రూపాయలు, అల్పసంఖ్యాక వర్గాల సంక్షేమానికి 4,376 కోట్ల రూపాయలను కేటాయించాలని నేను ప్రతిపాదిస్తున్నాను.

**మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమం**

**డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్** గారు మహిళా సాధికారత ప్రాముఖ్యతను నొక్కి చెబుతూ ఇలా అన్నారు:

**"మహిళలు సాధించిన పురోగతి స్థాయిని బట్టి నేను సమాజం యొక్క పురోగతిని కొలుస్తాను."**

23. గౌరవనీయులైన ముఖ్యమంత్రిగారు కూడా ఈ ఆలోచనను గట్టిగా విశ్వసిస్తారు. ఆయన నాయకత్వంలో 1990వ దశకంలోనే మన రాష్ట్రం స్వయం సహాయక బృందాల ఉద్యమంలో దేశంలోనే అగ్రగామిగా నిలిచింది. పొదుపు చేయడం వలన మహిళలలో వ్యవస్థాపక శక్తి పెరుగుతుందని, ఫలితంగా స్వయం ఉపాధి మాత్రమే కాకుండా సాధికారత కూడా లభిస్తుందని వారి దృఢవిశ్వాసం. విస్తృత స్థాయిలో ఒక ఉద్యమంలాగా జరుగుతున్న కార్యకలాపాలకు, నాటి ప్రభుత్వ సహకారం లభించడం వలన రాష్ట్రంలోని స్వయం సహాయక సంఘాలకు విశేష ఆదరణ దక్కింది. దీని వలన మన రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలిచింది. నేడు మన రాష్ట్రంలో 10 లక్షలకు పైగా స్వయం సహాయక సంఘాలు ఉన్నాయి.

24. గర్భిణులు, బాలింతలు మరియు ఆరేళ్లలోపు పిల్లల పౌష్టికాహార స్థితిని మెరుగుపరిచేందుకు మా ప్రభుత్వం అనేక వినూత్న చర్యలు తీసుకుంటోంది. 26 జిల్లాలలోని 55,607 అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సమీకృత శిశు అభివృద్ధి (ఐ.సి.డి.ఎస్.) సేవలను మా ప్రభుత్వం అందిస్తోంది. పౌష్టికాహార లోపం మరియు రక్తహీనతల నివారణకు **బాల సంజీవని సప్లిమెంటరీ పౌష్టికాహార**

**కార్యక్రమాన్ని అమలు చేయడం జరుగుతోంది. ఈ సరుకులన్నింటినీ టేక్ హోమ్ రేషన్ రూపంలో అందించడం జరుగుతోంది.**

25. **సూపర్ సిక్స్ వాగ్దానాలను నెరవేర్చే దిశగా, మా ప్రభుత్వం దీపం-2 పథకాన్ని** ప్రారంభించి, సంవత్సరానికి 3 ఎల్.పి.జి. సిలిండర్‌లను ఉచితంగా అందిస్తోంది. 2024-25లో మొదటి ఉచిత ఎల్.పి.జి. సిలిండర్ పంపిణీ కోసం 895 కోట్ల రూపాయలను విడుదల చేయడం జరిగింది. ఇందులో భాగంగా ఇప్పటికే 5 లక్షల మందికి పైగా లబ్ధిదారులకు రాయితీ సొమ్ము అందింది. ప్రజారవాణా బస్సులలో మహిళలకు ఉచిత ప్రయాణాన్ని ప్రవేశపెడతామని ఇచ్చిన మరో హామీని కూడా త్వరలో అమలు చేయడం జరుగుతుంది. ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశ్యం శ్రామిక శక్తిలో మహిళల భాగస్వామ్యాన్ని పెంచడమే.

26. 2024-25 ఆర్థిక సంవత్సరానికి మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖకు 4,285 కోట్ల రూపాయల కేటాయింపును ప్రతిపాదిస్తున్నాను.

**మానవ వనరుల అభివృద్ధి**

**<u>నైపుణ్యాభివృద్ధి</u>**

నైపుణ్యాభివృద్ధి ప్రాధాన్యత గురించి చైనా తత్వవేత్త **లావో ట్జు** ఇలా అన్నారు.

**"ఒక మనిషికి ఆహారంగా ఒక చేపను ఇస్తే,**

**ఒక రోజు ఆహారాన్ని మాత్రమే ఇచ్చినట్లు అవుతుంది.**

**అందుకే అతనికి చేపలు పట్టడం నేర్పించు-జీవితాంతం తిండి పెట్టినట్లు అవుతుంది".**

27. 2014-19 కాలంలోనే గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడుగారు నైపుణ్యాభివృద్ధి, విద్య మరియు దీర్ఘకాల పరిష్కారాల ప్రాముఖ్యతను అర్థం చేసుకొని అనేక నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టడం జరిగింది. ఈ రోజు గౌరవ మానవ వనరుల అభివృద్ధి శాఖా మంత్రి శ్రీ నారా లోకేష్ గారు **నైపుణ్య గణన** అనే వినూత్న కాన్సెప్ట్‌కు నాయకత్వం వహిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా తొలిసారిగా మా ప్రభుత్వం రాష్ట్ర స్థాయిలో **నైపుణ్య గణన** నిర్వహిస్తోంది. ఇది మన శ్రామిక శక్తి యొక్క నైపుణ్యాలను మరియు సామర్థ్యాలను అర్థం చేసుకోవడానికి, తదనుగుణంగా పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను గుర్తించడానికి సహాయపడుతుంది. ఇది 20 లక్షల మందికి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు అనువైన నైపుణ్యాలను అందించే కార్యక్రమాల రూపకల్పనకు దోహదపడుతుంది.

28. ఇదే సమయంలో మా ప్రభుత్వం 192 నైపుణ్య కేంద్రాలు, నైపుణ్య కళాశాలలు మరియు నైపుణ్య విశ్వవిద్యాలయాల ద్వారా నైపుణ్య రంగంలో మౌలిక వనరులను బలోపేతం చేస్తోంది. ప్రాధాన్య రంగాలలో విదేశీ ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునేలా చేయడమే **స్కిల్ ఇంటర్నేషనల్** యొక్క తాజా ప్రయత్నం. 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను నైపుణ్యాభివృద్ధి శాఖకు 1,215 కోట్ల రూపాయల కేటాయింపును ప్రతిపాదిస్తున్నాను.

**పాఠశాల విద్య**

29. ప్రభుత్వ మరియు ప్రైవేటు పాఠశాలలలో ఒకటో తరగతి నుంచి పన్నెండో తరగతి వరకు చదివే పిల్లల తల్లులకు **తల్లికి వందనం పథకం** ద్వారా

ఆర్థిక సహాయం అందిస్తూ మా ప్రభుత్వం **సూపర్ సిక్స్** హామీని నెరవేరుస్తోంది. పేదరికం కారణంగా ఏ పిల్లవాడూ విద్యకు దూరం కాకూడదు అనేది ఈ పథకం లక్ష్యం. ఇది మధ్యలోనే చదువు మానివేసే పిల్లల సంఖ్యను గణనీయంగా తగ్గించడానికి సహాయపడుతుంది.

30. పాఠశాలలలో మౌలిక సదుపాయాలను మరియు విద్యార్థుల అభ్యసన ఫలితాలను మెరుగుపరిచేందుకు మా ప్రభుత్వం సమగ్ర సంస్కరణలు చేపడుతోంది. మన యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి మరియు విద్యావ్యవస్థలో యువ ఉపాధ్యాయుల నూతన శక్తిని నింపేందుకు, ఖాళీగా ఉన్న 16,347 పోస్టులను భర్తీ చేసే దిశగా మెగా డి.ఎస్.సి. నియామకాన్ని ప్రకటించడం జరిగింది. ఇది మా ప్రభుత్వం తీసుకున్న ప్రధాన నిర్ణయాలలో ఒకటి. ముఖ్యమైన పథకాలకు ప్రముఖ విద్యావేత్త డా॥ **సర్వేపల్లి రాధాకృష్ణన్** మరియు సామాజిక కార్యకర్త **శ్రీమతి డొక్కా సీతమ్మ**గారి పేర్లను మా ప్రభుత్వం పెట్టింది. ఉపాధ్యాయులు బోధనపై మరింత దృష్టి పెట్టేందుకు వీలుగా అనవసరమైన యాప్‌లను తొలగించడం ద్వారా ఉపాధ్యాయులపై యాప్ భారాన్ని తగ్గించడం జరిగింది. ఇంటర్ విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు మరియు బ్యాగులు అందించడం జరిగింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి పాఠశాల విద్యాశాఖకు 29,909 కోట్ల రూపాయల కేటాయింపును ప్రతిపాదిస్తున్నాను.

**ఉన్నత విద్య**

31. **స్వర్ణాంధ్ర విజన్-2047** లో భాగంగా, మా ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాలను బలోపేతం చేయడానికి, ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయడానికి, జాతీయ సంస్థాగత స్థాయి చట్రం (ఎన్.ఐ.ఆర్.ఎఫ్.)లో అత్యున్నత స్థాయి విశ్వవిద్యాలయాలుగా అవతరించడానికి చొరవ తీసుకుంటోంది. అమరావతి, తిరుపతి మరియు విశాఖపట్నంలలో కనీసం మూడు విజ్ఞాన నగరాలను ఏర్పాటు చేయాలని మా ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

32. నాణ్యమైన విద్యకు అత్యంత నైపుణ్యం కలిగిన అధ్యాపకులు అవసరమని గుర్తించి, వచ్చే మూడేళ్లలో 18 వేల మంది అధ్యాపకులకు శిక్షణాభివృద్ధి కార్యక్రమాలను ప్రతిపాదించడం జరిగింది. 2024 డిసెంబర్ నుండి 2.5 లక్షల మందికి పైగా విద్యార్థులకు వృత్తి శిక్షణను సులభతరం చేయడానికి నాస్కామ్ ఫ్యూచర్ స్కిల్స్, ఎడ్యుస్కిల్స్, సేల్స్‌ఫోర్స్, మైక్రోసాఫ్ట్ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థలతో ప్రభుత్వం అవగాహన ఒప్పందాలు కుదుర్చుకుంది. సమాచార సాంకేతికత మరియు ఆధారిత రంగాలు, బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, బీమా సేవలు, వనరులను సమకూర్చే సేవలు, చిల్లర వర్తకము మరియు ఆరోగ్య సంరక్షణ వంటి వివిధ రంగాలలో 5 వేల రూపాయల నుండి 15 వేల రూపాయల మధ్య వేతనాన్ని అందించే **అప్రెంటిస్‌షిప్‌తో కూడిన డిగ్రీ విద్యను** మా ప్రభుత్వం ప్రవేశపెట్టింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి ఉన్నత విద్యా శాఖకు 2,326 కోట్ల రూపాయల కేటాయింపును ప్రతిపాదిస్తున్నాను.

**ఆరోగ్య సంరక్షణ**

33. పౌరులకు సరసమైన మరియు నాణ్యమైన ఆరోగ్య సంరక్షణ సేవలను సకాలంలో అందించడం మా ప్రభుత్వం యొక్క మొదటి ప్రాధాన్యత. **'అందరికీ ఆరోగ్యం'** లక్ష్యంగా మా ప్రభుత్వం ఆరోగ్య రంగంలో సమగ్ర సంస్కరణలు చేపడుతోంది. హృదయ సంబంధ వ్యాధులు పెరుగుతున్న దృష్ట్యా, అవసరమైన పరికరాలు మరియు మానవ వనరుల శిక్షణను అందించడం ద్వారా **'స్టెమి' ప్రోగ్రామ్**ను ప్రారంభించాలని యోచిస్తున్నాము. రాష్ట్రవ్యాప్తంగా సమగ్ర క్యాన్సర్ స్క్రీనింగ్ కార్యక్రమాన్ని ప్రారంభించడం ద్వారా క్యాన్సర్ కేసులను గుర్తించి, వైద్య కళాశాలలలో వైద్యం కోసం చేరే సౌకర్యం కల్పించింది. **పాఠశాల ఆరోగ్య కార్యక్రమం** క్రింద, అంగన్‌వాడీ పిల్లలకు మరియు 18 సంవత్సరాలలోపు ఉన్న పాఠశాల విద్యార్థులకు **పుట్టుకతో వచ్చిన లోపాలు, పోషకాల లోపం వలన వచ్చే వ్యాధులు, మందకొడి అభివృద్ధి మరియు వైకల్యం** అనే నాలుగు రకాల లోపాలను గుర్తించడం కోసం పరీక్షలు చేయబడుతున్నాయి. రాష్ట్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుంచి సాధారణ ఆస్పత్రుల వరకు అన్ని రకాల వైద్య సదుపాయాలను మెరుగుపరచడం జరుగుతోంది.

34. మా ప్రభుత్వం **'డాక్టర్ ఎన్.టి.ఆర్ వైద్య సేవా ట్రస్ట్'** వంటి ప్రతిష్ఠాత్మక కార్యక్రమాలు, **108** మరియు **104 ఆరోగ్య సేవల** పునరుద్ధరణ మరియు **జాతీయ ఆరోగ్య మిషన్** క్రింద కుటుంబ సంక్షేమ కార్యక్రమాలను సమగ్రంగా అమలు చేయడం జరుగుతోంది. మాతాశిశు ఆరోగ్య సంరక్షణలో జాతీయ సగటు కంటే మన రాష్ట్ర సగటు మెరుగ్గా ఉంది. తల్లులు మరియు పిల్లల శ్రేయస్సును పెంచే కార్యక్రమాలను అమలు చేయడం ద్వారా దీనిని మరింత

మెరుగుపరచడానికి చర్యలు తీసుకుంటున్నాము. 2024-25 ఆర్థిక సంవత్సరానికిగాను వైద్య, ఆరోగ్య శాఖ కోసం 18,421 కోట్ల రూపాయల కేటాయింపును ప్రతిపాదిస్తున్నాను.

**పంచాయతీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి**

**మహాత్మాగాంధీ** ఇలా అన్నారు...

**"భారతదేశ ఆత్మ గ్రామాలలో ఉంటుంది."**

35. గౌరవనీయ ఉపముఖ్యమంత్రి శ్రీ కొణెదల పవన్ కళ్యాణ్‌గారి సమర్థ నాయకత్వంలో, స్థానిక స్వపరిపాలనను నిజమైన స్ఫూర్తితో ప్రోత్సహించడం ద్వారా పంచాయతీరాజ్ వ్యవస్థకు పూర్వ వైభవం తీసుకురావడానికి ఇప్పటికే మా ప్రభుత్వం చాలా కార్యక్రమాలు చేపట్టింది. ప్రణాళికా ప్రక్రియలో భాగంగా అన్ని గ్రామపంచాయితీల క్రియాశీలక భాగస్వామ్యంతో **ఉపాధి హామీ పథకం** ఆమోదం కోసం ఆగస్టు 23న ఒకే రోజులో 13,326 గ్రామ పంచాయతీలలో ప్రత్యేక గ్రామసభలను నిర్వహించడం అనేది ప్రపంచ రికార్డు. మన రాష్ట్రంలోని అన్ని గ్రామాలలో సిమెంట్ రహదారులు ప్రారంభించడంతో కార్యాచరణ ప్రణాళిక అమలు ప్రారంభమైంది. స్వాతంత్ర్య దినోత్సవం మరియు గణతంత్ర దినోత్సవాల నిర్వహణ ఖర్చుల నిమిత్తం చిన్న పంచాయితీలకు 100 రూపాయల నుండి 10 వేల రూపాయలకు, పెద్ద పంచాయితీలకు 250 రూపాయల నుండి 25 వేల రూపాయలకు పెంచి సర్పంచుల ఆత్మగౌరవాన్ని పునరుద్ధరించటం జరిగింది. **స్వర్ణ పంచాయితీల కార్యక్రమం** క్రింద పంచాయితీల అభివృద్ధికి ప్రభుత్వం దార్శనిక ప్రణాళికను చేపట్టింది. 2024

మార్చి నుంచి పంచాయితీరాజ్ సంస్థలకు రావాల్సిన 15వ ఆర్థిక సంఘం నిధులలో 998 కోట్ల రూపాయలను ప్రభుత్వం 2024 ఆగస్టులో విడుదల చేయడం జరిగింది.

36. గ్రామీణ పేదలకు సుస్థిర జీవనోపాధిని అందించడానికి మరియు గ్రామీణ ప్రాంతాలలో మన్నికైన ఆస్తులను సృష్టించడానికి మా ప్రభుత్వం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం క్రింద 16 శాఖల సమన్వయంతో వివిధ వినూత్న కార్యక్రమాలను అమలు చేస్తోంది. 2024-25 సంవత్సరంలో ఇప్పటివరకు 1.2 మిలియన్‌లకు పైగా కుటుంబాలు 100 రోజుల వేతన ఉపాధిని పొందాయి. ఉద్యానవనం, సేద్యపు కుంటలు, పశుసంవర్ధక ఆవాసాలు వంటి ప్రాజెక్టులతో పాటు పైకప్పు నీటి సంరక్షణ, ఇంకుడు గుంతలు, చెక్ డ్యాంలతో సహా సహజ వనరుల నిర్వహణ ప్రాజెక్టులను చేపట్టడం జరిగింది.

37. గ్రామీణ ప్రాంతాలలోని ప్రతి పేద కుటుంబాన్నీ పేదరికం నుండి బయటపడేటట్లు చేసేందుకు మా ప్రభుత్వం కట్టుబడి ఉంది. ప్రధాన మంత్రి ఉపాధి కల్పన కార్యక్రమం, ప్రధానమంత్రి సూక్ష్మ ఆహార సంస్థల అధికారీకరణ, ప్రధానమంత్రి స్వనిధి పథకం మరియు ప్రధాన మంత్రి విశ్వకర్మ వంటి వివిధ కేంద్ర ప్రభుత్వ రాయితీ పథకాలతో అనుసంధానం చేయడం ద్వారా స్వయం సహాయక బృంద సభ్యుల జీవనోపాధికి మా ప్రభుత్వ కార్యక్రమాలు మద్దతును ఇస్తున్నాయి. ఈ వినూత్న కార్యక్రమాల అమలు ద్వారా స్వయం సహాయక బృంద సభ్యుల ఆదాయాన్ని పెంచడంతోపాటు, అనధికారిక ఉపాధి అవకాశాలను పెంచడం కూడా మా ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

అదనంగా, ఓపెన్ నెట్ వర్క్ డిజిటల్ కామర్స్ (ఒ.ఎన్.డి.సి.)ని ప్రోత్సహించడం ద్వారా, మా ప్రభుత్వం స్వయం సహాయక బృంద మహిళలకు వారి వ్యాపారాలను విస్తరించుకోవడానికి వీలు కల్పిస్తోంది. వారి ఉత్పత్తులను మార్కెట్లకు చేర్చడానికి విస్తృతంగా అవకాశాలను కల్పిస్తూ మరియు వారి అమ్మకాల సామర్థ్యాన్ని మెరుగుపరచడంలో ఇది వారికి సహాయపడుతుంది. ఈ వ్యూహాత్మక విధానంలో ఆర్థిక సహాయం, నైపుణ్యాభివృద్ధి మరియు డిజిటల్ అవుట్ రీచ్‌లు మిళితం అవడంవలన స్వయం సహాయక బృంద సభ్యులు స్థిరమైన ఆదాయ వృద్ధిని పెంపొందించకోగలుగుతారు.

38. ఆంధ్రప్రదేశ్ గ్రామీణ రహదారుల అనుసంధాన ప్రాజెక్టు ద్వారా 1,574 పనులను పూర్తి చేయడం జరిగింది. ఈ ప్రాజెక్టు 2,134 ఆవాసాలను 2,855 కిలోమీటర్ల రహదారులతో కలుపుతుంది. అదనంగా 164 రహదారులు మరియు వంతెనల ప్రాజెక్టులు కూడా కొనసాగుతున్నాయి. 2024-25 ఆర్థిక సంవత్సరానికి పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు 16,739 కోట్ల రూపాయల కేటాయింపును ప్రతిపాదిస్తున్నాను.

**పట్టణాభివృద్ధి**

39. గత ప్రభుత్వ హయాంలో పట్టణ ప్రాంతాలు తీవ్ర నిర్లక్ష్యానికి గురయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా పురపాలక సంఘాలలో పారిశుద్ధ్య లోపం మరియు వ్యర్థాల నిర్వహణా లోపం వలన టన్నుల కొద్దీ వ్యర్థాలు మరియు పూడిక పేరుకుపోయాయి. నేడు మా ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా సుస్థిర పట్టణాభివృద్ధికి కట్టుబడి ఉంది. విశాఖపట్నం, కాకినాడ, విజయవాడ,

గుంటూరు, తిరుపతి, కర్నూలు తదితర ప్రధాన నగరాలను అభివృద్ధి చేయనున్నాము. 50 వేల నుంచి 99,999 మంది జనాభా ఉన్న రెండో తరగతి పట్టణాలకు భౌగోళిక సమాచార వ్యవస్థ (జి.ఐ.ఎస్.) ఆధారిత బృహత్తర ప్రణాళికల రూపకల్పనకు శ్రీకారం చుట్టడం జరిగింది. అమృత్ 2.0 క్రింద జలవనరుల పునరుద్ధరణ, మురుగు నీటిని శుద్ధి చేసి తిరిగి వినియోగించుకోవడం, వర్షపు నీటి సంరక్షణతోపాటు ప్రజలందరికీ సురక్షిత నీటిని సరఫరా చేయాలని మా ప్రభుత్వం భావిస్తోంది. అన్ని పట్టణ ప్రాంతాలలో పట్టణ మౌలిక సదుపాయాలు మరియు అత్యవసర సేవలకు సేవా స్థాయి ప్రమాణాలను సాధించడానికి ప్రణాళికలు రూపొందించబడ్డాయి.

40. ఐదేళ్లుగా కనుమరుగైన మన రాష్ట్ర కలల రాజధాని అమరావతి నేడు రూపుదిద్దుకుంటోంది. ప్రపంచ స్థాయిలోనే అత్యుత్తమ మౌలిక సదుపాయాలు, పెట్టుబడులు మరియు ఉద్యోగాలకు ప్రపంచ గమ్యస్థానంగా అమరావతి మారబోతుంది. అత్యంత నివాసయోగ్యమైన, సమర్థవంతమైన మరియు సుస్థిరమైన హరిత నగరంగా అమరావతిని తీర్చిదిద్దేందుకు మా ప్రభుత్వ ప్రణాళికలు దోహదపడ్డాయి. రాజధాని నగరంలో మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడానికి మా ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం ద్వారా బహుళపాక్షిక నిధుల సంస్థల నుండి 15 వేల కోట్ల రూపాయల నిధులను పొందడం జరిగింది.

41. పట్టణ ప్రాంతాలలో నివసిస్తున్న నిరుపేదలకు సరసమైన ధరలకు ఆహారాన్ని అందించడానికి మా ప్రభుత్వం మొత్తం 123 పట్టణ ప్రాంతాల పరిధిలో 204 అన్నా క్యాంటీన్‌లను ఏర్పాటు చేయడం జరిగింది. గ్రామీణ

ప్రాంతాలలో కూడా 158 **అన్నా క్యాంటిన్**లను ఏర్పాటు చేయడానికి ప్రణాళికలు సిద్ధచేయడం జరిగింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి పురపాలక, పట్టణాభివృద్ధి శాఖకు 11,490 కోట్ల రూపాయల కేటాయింపును ప్రతిపాదిస్తున్నాను.

**గృహనిర్మాణం**

42. 2029 నాటికి అందరికీ ఇళ్ళు నిర్మించి ఇవ్వాలని మా ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది. **'ప్రధానమంత్రి ఆవాసయోజన (పి.ఎం.ఎ.వై.)-ఎన్.టి.ఆర్. నగరాలు'** పథకం క్రింద ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు 25 లక్షల ఇళ్ళు/ఇళ్ళ పట్టాలు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకోవడం జరిగింది. ఈ నిర్ణయం ఆర్థికంగా వెనుకబడిన వర్గాల సంక్షేమ కార్యక్రమంగానే కాకుండా రాష్ట్ర ఆర్థిక కార్యకలాపాలకు కూడా ఊతమిస్తోంది. ఈ కార్యక్రమం క్రింద ఇంటి స్థలంకానీ, పక్కా ఇళ్ళు కానీ లేని వారికి ఇళ్ళ స్థలాల పట్టాలు జారీ చేయడం జరుగుతోంది. ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పి.ఎం.ఎ.వై.) (నగరం) క్రింద 6.9 లక్షల ఇళ్ళు, ప్రధానమంత్రి ఆవాసయోజన (పి.ఎం.ఎ.వై.) (గ్రామీణ) క్రింద 1.79 లక్షల గ్రామీణ ఇళ్ళను పూర్తి చేయాలని ప్రతిపాదించడం జరిగింది. ప్రధానమంత్రి-జన్‌మన్ పథకం క్రింద నిస్సహాయ గిరిజన సమూహాల కోసం 15 వేలకు పైగా గృహాలను పూర్తి చేయాలని ప్రతిపాదించడం జరిగింది. అన్ని శాఖల సమన్వయంతో హౌసింగ్ లేఅవుట్‌లలో మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడానికి మా ప్రభుత్వం కట్టుబడి ఉంది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి గృహనిర్మాణ శాఖకు 4,012 కోట్ల రూపాయల కేటాయింపును ప్రతిపాదిస్తున్నాను.

**జలవనరుల నిర్వహణ**

43. సాగునీటి రంగాన్ని గత ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. వంశధార స్టేజ్-2 (2వ దశ), హంద్రీనీవా సుజల స్రవంతి 2వ దశ, వెలిగొండ ప్రాజెక్టు, తోటపల్లి బ్యారేజీ, గజపతినగరం బ్రాంచ్ కెనాల్, చింతలపూడి ఎత్తిపోతల పథకం, పులిచింతల, గుండ్లకమ్మ రిజర్వాయర్, సోమశిల-స్వర్ణముఖి లింక్ కెనాల్ వంటి సాగునీటి ప్రాజెక్టులలో ఏ ఒక్కదానిలోనూ పురోగతి లేదు. పోలవరం విషయంలో కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖకు చెందిన పోలవరం ప్రాజెక్టు అథారిటీ సలహాలను పట్టించుకోకుండా నిర్మాణం కీలక దశలో ఉన్నప్పుడు ఏజెన్సీని హఠాత్తుగా మార్చడం వలన డయాఫ్రమ్ గోడ కూలి ప్రాజెక్టు నిర్మాణంలో తీవ్ర జాప్యం జరిగింది. ప్రాజెక్టు ప్రయోజనాల కోసం ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న ఆంధ్ర, ఉత్తరాంధ్ర మరియు రాయలసీమ వాసులను ఈ జాప్యం కలవరపెట్టింది.

44. మా ప్రభుత్వం సాగునీటి రంగానికి అధిక ప్రాధాన్యతను ఇస్తూ ప్రతి పొలానికీ నీటిని తీసుకెళ్లాలనే లక్ష్యంతో సమగ్ర నూతన జల విధానాన్ని రూపొందించడం జరుగుతోంది. రాష్ట్రాన్ని కరవు రహిత రాష్ట్రంగా తీర్చిదిద్ది త్రాగు, సాగు మరియు పారిశ్రామిక అవసరాలకు నీటి భద్రతను కల్పించేందుకు కార్యాచరణ ప్రణాళికలు రూపొందించడం జరిగింది. **పోలవరం జాతీయ నీటిపారుదల ప్రాజెక్టును** త్వరితగతిన పూర్తి చేయడం మా ప్రభుత్వ మొదటి ప్రాధాన్యత. చింతలపూడి ఎత్తిపోతల పథకం, బొడ్డేపల్లి రాజగోపాలరావు వంశధార ప్రాజెక్టు 2వ దశ, పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు, హంద్రీనీవా సుజల స్రవంతి ప్రాజెక్టు, టి.బి.పి.-హెచ్.ఎల్.సి. వ్యవస్థ మెరుగుదల, చిన్న

నీటిపారుదల, వాటర్ షెడ్, భూగర్భ జలాల నిర్వహణలతో సహా నిర్మాణంలో ఉన్న అన్ని ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు మా ప్రభుత్వం కట్టుబడి ఉంది. వీటితోపాటు అదనంగా **భవనాసి చెరువు మార్పిడి ప్రాజెక్టును** మరియు **మహేంద్రతనయ ఆఫ్‌షోర్ ప్రాజెక్ట్‌ను** చేపట్టాలని మా ప్రభుత్వం భావిస్తోంది. గోదావరి-పెన్నా, నాగావళి-వంశధార నదులను అనుసంధానం చేయటం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా నీటి భద్రత కల్పించాలని భావిస్తోంది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి జలవనరుల శాఖకు 16,705 కోట్ల రూపాయల కేటాయింపును ప్రతిపాదిస్తున్నాను.

**పరిశ్రమలు మరియు వాణిజ్యం**

45. పారిశ్రామికాభివృద్ధికి అనువైన వాతావరణాన్ని కల్పించడంపై మా ప్రభుత్వం దృష్టి సారించింది. పెట్టుబడిదారులను మరియు ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించి తద్వారా వివిధ రంగాలలో ఉపాధిని కల్పించే దిశగా నూతన విధానాలను రూపొందించడం జరిగింది. మా ప్రభుత్వం **ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక అభివృద్ధి పాలసీ 4.0** తీసుకొని రావడం జరిగింది. **ఆంధ్రప్రదేశ్ సూక్ష్మ, చిన్న, మధ్య తరహా అభివృద్ధి పాలసీ 4.0** తక్షణమే ఉపయోగించుకునేటట్లుగా (ప్లగ్ & ప్లే) ప్రైవేట్ పారిశ్రామిక వాడల ఏర్పాటుకు ఒక ప్రత్యేక విధానం, **ఆంధ్రప్రదేశ్ ఫుడ్ ప్రాసెసింగ్ పాలసీ 4.0** లను మా ప్రభుత్వం తీసుకురావడం జరిగింది. ఈ విధానాలలో పోటీతత్వ ప్రోత్సాహక పద్ధతిని ప్రవేశపెట్టగా, దీనికి పారిశ్రామిక రంగం నుండి సానుకూల స్పందన వచ్చింది. మన రాష్ట్రాన్ని పెట్టుబడుల గమ్యస్థానంగా మార్చేందుకు పెట్టుబడిదారులలో మా ప్రభుత్వం మళ్ళీ ఆసక్తిని పెంచింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి పరిశ్రమలు, వాణిజ్య శాఖకు 3,127 కోట్ల రూపాయల కేటాయింపును ప్రతిపాదిస్తున్నాను.

**ఇంధన రంగం**

46. గత ప్రభుత్వ విధ్వంస చర్యల ఫలితంగానే ఇంధన రంగం నాశనమైంది. గత ప్రభుత్వం ప్రమాణ స్వీకారోత్సవ వేదిక నుంచే విద్యుత్ కొనుగోలు ఒప్పందాలను రద్దు చేస్తున్నట్లు ప్రకటించటం ద్వారా ఈ విధ్వంసం ప్రారంభమైనది. ఈ చర్య రాష్ట్ర ఇంధన రంగ పునాదులను కదిలించింది. అంతేకాక ఇంధన రంగ విస్తరణ ప్రణాళికలను విచ్ఛిన్నం చేయడం ద్వారా విద్యుత్ కొరతకు కారణం అయ్యింది. తత్ఫలితంగా అధిక ధరలతో విద్యుత్‌ను కొనుగోలు చేయవలసి వచ్చింది. అంతిమంగా గత ప్రభుత్వ తప్పిదాల వలన నేడు వినియోగదారులు **ట్రూ అప్ ఛార్జీల** పేరుతో విద్యుత్ కోసం అధిక ధర చెల్లించాల్సి వస్తోంది.

47. ఈ నష్టాన్ని పూడ్చడానికి, వినియోగదారులకు తక్కువ ఖర్చుతో, వారంలో అన్ని రోజులూ 24 గంటలపాటు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయడానికి మా ప్రభుత్వం కట్టుబడి ఉంది. రాష్ట్రంలో సుస్థిరత, ఇంధన పరివర్తన మరియు క్లీన్ ఎనర్జీ సాంకేతికతలను ప్రోత్సహించేందుకు **నూతన సమగ్ర ఆంధ్రప్రదేశ్ సమీకృత క్లీన్ ఎనర్జీ విధానం-2024**ను ప్రకటించడం జరిగింది. పునరుత్పాదక ఇంధనం, పంప్డ్ స్టోరేజ్ పవర్, హరిత హైడ్రోజన్ మరియు దాని ఉత్పన్నాలను ప్రోత్సహించడానికి కొత్త విధానం మార్గాన్ని సుగమం చేస్తుంది. అంతేగాక రాష్ట్రాన్ని పెట్టుబడులను ఆకర్షించే గమ్యస్థానంగా కూడా మారుస్తుంది. మా ప్రభుత్వం ఆక్వా రైతులకు తక్కువ ధరకే విద్యుత్‌ను సరఫరా చేస్తూ, షెడ్యూల్డ్ కులాల మరియు షెడ్యూల్డ్ తెగల వారి కాలనీలలో ప్రతి ఇంటికీ నెలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను

అందిస్తోంది. ధోబీ ఘాట్లకు అలాగే దారిద్ర్యరేఖకు దిగువనున్న రజక సామాజిక వర్గము వారు నిర్వహిస్తున్న లాండ్రీలకు, దారిద్ర్యరేఖకు దిగువనున్న నాయీబ్రాహ్మణుల క్షౌరశాలలకు, దారిద్ర్యరేఖకు దిగువనున్న స్వర్ణకారుల దుకాణాలకు, దారిద్ర్యరేఖకు దిగువనున్న అత్యంత వెనుకబడిన కులాలకు మరియు చేనేత కార్మికులకు ఉచితంగా లేదా రాయితీపై విద్యుత్ అందించబడుతోంది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను ఇంధన శాఖకు 8,207 కోట్ల రూపాయల కేటాయింపును ప్రతిపాదిస్తున్నాను.

**రవాణా, రోడ్లు మరియు భవనాలు**

48. రహదారుల నిర్వహణ మరియు మరమ్మత్తుల విషయంలో గత పాలకులు నిర్లక్ష్యం వహించడం వలన రాష్ట్రంలో రహదారుల కంటే గుంతలే ఎక్కువగా ఉన్నాయి. ఏళ్ల తరబడి నడుస్తున్న మౌలిక సదుపాయాల పురోగతికి విఘాతం కలిగింది. ఒకప్పుడు 2019 నాటికి నాణ్యమైన రహదారుల అనుసంధానత ఉన్న మన రాష్ట్రం, 2024 నాటికి గుంతల మయమైన రహదారులతో సతమతమవుతోంది. సంక్రాంతి నాటికి రాష్ట్రంలోని అన్ని రహదారులు గుంతలు లేకుండా ఉండాలనే లక్ష్యంతో, మన గౌరవ ముఖ్యమంత్రిగారు **గుంతలు లేని రహదారుల ఆంధ్ర** అనే మిషన్‌కు శ్రీకారం చుట్టారు. వీటి పునర్నిర్మాణ ప్రయత్నాలు జరుగుతున్నాయి. అనుసంధానతను మరింత బలోపేతం చేయడానికి, గతి శక్తి కార్యక్రమానికి అనుగుణంగా రాష్ట్ర రహదారి మౌలిక సదుపాయాలను జాతీయ గ్రిడ్‌తో మా ప్రభుత్వం అనుసంధానం చేస్తోంది.

49. అమరావతి అవుటర్ రింగు రోడ్డు ప్రాజెక్టు గత ప్రభుత్వ హయాంలో నిలిచిపోయింది. 189 కిలోమీటర్ల పొడవైన అమరావతి అవుటర్ రింగు రోడ్డు ఎక్స్‌ప్రెస్-వే పునరుద్ధరణకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టు రాజధానిని రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలతో అనుసంధానిస్తుంది. ఈ ప్రాజెక్టు మన రాష్ట్రంలో ప్రాంతీయ అనుసంధానతను మరియు ఆర్థిక అభివృద్ధిని పెంచుతుంది.

50. మన రాష్ట్రంలో 687 కిలోమీటర్ల మేర ఆరు వరుసల జాతీయ రహదారి ప్రాజెక్టుల పనులు ఎంతో పురోగతిలో ఉన్నాయి. వీటిలో బెంగళూరు-కడప-విజయవాడ, రాయపూర్-విశాఖపట్నం, చిత్తూరు-థాట్చూరు, రేణిగుంట-నాయుడుపేట, విజయవాడ పశ్చిమ బైపాస్, నాయుడుపేట-తుర్పు కనుపూరు వంటి ముఖ్యమైన రహదారులు ఉన్నాయి. వీటితో పాటు నాలుగు వరుసల జాతీయ రహదారులైన హైదరాబాద్-విశాఖపట్నం, బెంగళూరు-చెన్నై ఎక్స్‌ప్రెస్ రహదారులలో 165 కిలోమీటర్ల మేర పనులు పురోగతిలో ఉన్నాయి.

51. న్యూ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆర్థిక సహకారంతో **మండల అనుసంధానత మరియు గ్రామీణ అనుసంధానత అభివృద్ధి ప్రాజెక్టు** మరియు **ఆంధ్రప్రదేశ్ రహదారులు మరియు వంతెనల పునర్నిర్మాణ ప్రాజెక్టు**లను మా ప్రభుత్వం అమలు చేస్తోంది. ఈ ప్రాజెక్టులు జిల్లా ప్రధాన కేంద్రాలు మరియు మండల కేంద్రాల మధ్య, అదేవిధంగా అన్ని మండల కేంద్రాల మధ్య రెండు వరసల రహదారుల అనుసంధానతను కల్పించడానికి 2,522 కిలోమీటర్ల రహదారులను ఈ పరిధిలోనికి తీసుకువస్తాయి.

52. వాహనాలు త్వరితగతిన నడిచేందుకు వీలుగా ప్రధానమైన జిల్లా రహదారుల ఉపరితలాన్ని మెరుగుపరచడానికి 2,199 కిలోమీటర్ల మేర పనులను మంజూరు చేయడం జరిగింది. వీటిని 2025 మార్చి నాటికి పూర్తి చేయాలని మా ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. గిరిజన ప్రాంతాలలో అనుసంధానతను మెరుగుపరచడం కోసం మరియు వరదల వలన దెబ్బతిన్న రహదారులకు మరమ్మతులు చేయడం కోసం, 99 రాష్ట్ర రహదారులు మరియు 134 జిల్లా ప్రధాన రహదారులను జాతీయ వ్యవసాయ మరియు గ్రామీణ అభివృద్ధి బ్యాంకు (నాబార్డు) నిధులతో పూర్తి చేయడానికి మా ప్రభుత్వం ప్రాధాన్యతను ఇస్తోంది.

53. 2024 జూన్ నుంచి మా ప్రభుత్వం రహదారుల రంగానికి 600 కోట్ల రూపాయలు విడుదల చేసింది. రాష్ట్ర విపత్తు నివారణ నిధి (ఎస్.డి.ఆర్.ఎఫ్.) మరియు రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన నిధుల (ఎస్.డి.ఎమ్.ఎఫ్.) క్రింద కేటాయింపులతో సహా 2024-25 ఆర్థిక సంవత్సరానికి రవాణా, రోడ్లు మరియు భవనాల శాఖకు 9,554 కోట్ల రూపాయల కేటాయింపును ప్రతిపాదిస్తున్నాను.

**యువజన, పర్యాటక మరియు సాంస్కృతిక శాఖ**

**క్రీడలు**

54. మన రాష్ట్రానికి చెందిన క్రీడాకారులు జాతీయ మరియు అంతర్జాతీయ స్థాయిలో రాణించి రాష్ట్రానికి గర్వకారణంగా నిలుస్తున్నారు. మా ప్రభుత్వం క్రీడాకారులకు ప్రభుత్వ ఉద్యోగాలలో 3 శాతం రిజర్వేషన్‌లను ప్రకటించింది. ఇది దేశంలోనే అత్యధికం. మా ప్రభుత్వం ప్రతిపాదించిన ఆర్థిక ప్రోత్సాహకాలు

కూడా దేశంలోనే అత్యధికం. **అందరికీ క్రీడలు, ప్రతిభను పెంపొందించడం, స్పోర్ట్స్ ఎకోసిస్టమ్, క్రీడా సంస్కృతిని మరియు పర్యావరణ వ్యవస్థను క్షేత్రస్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయి వరకు బలోపేతం చేయడం**-అనే నాలుగు వ్యూహాత్మక స్తంభాలతో కొత్త క్రీడా విధానాన్ని 2024-29 కాలానికి మా ప్రభుత్వం తీసుకువస్తోంది. ఆర్థిక మరియు సామాజిక అభివృద్ధి కోసం క్రీడలను ప్రోత్సహించడం మరియు ఆరోగ్యకరమైన జీవనం కోసం క్రీడలను ప్రజా ఉద్యమంగా మార్చడంపై మా **ప్రభుత్వ క్రీడల విధానం** దృష్టి సారిస్తుంది.

55. గౌరవనీయ ముఖ్యమంత్రిగారు పర్యాటక రంగానికి పరిశ్రమ హోదాను కల్పించారు. ఇది ఒక చారిత్రాత్మక చర్య. ఇది ప్రైవేట్ పెట్టుబడులను గణనీయంగా ఆకర్షించే విధంగా రాష్ట్ర సామర్థ్యాన్ని మరింత పెంచింది. మన రాష్ట్రంలోని పర్యాటక రంగం ఉద్యోగాల కల్పనకు ఒక గొప్ప వరం. ఆధ్యాత్మిక పర్యాటకాన్ని ప్రోత్సహించడం ద్వారా పర్యాటక రంగాన్ని అభివృద్ధిచేయడానికి మా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోంది. పర్యావరణ మరియు వివిధ పర్యాటక ప్రదేశాలను ఏకకాలంలో అనుసంధానించే విధంగా పరిక్రమ పర్యాటక రంగాన్ని, సముద్రతీర పర్యాటక కేంద్రాలను, ఆరోగ్య పర్యాటక కేంద్రాలను మరియు చారిత్రక వారసత్వ ప్రదేశాలను అభివృద్ధి చేయడం ద్వారా పర్యాటక రంగాన్ని ప్రోత్సహించడాన్ని మా ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి యువజన, పర్యాటక మరియు సాంస్కృతిక శాఖకు 322 కోట్ల రూపాయల కేటాయింపును ప్రతిపాదిస్తున్నాను.

**పోలీస్ శాఖ**

56. గత అయిదేళ్లలో పోలీసు శాఖను నిర్లక్ష్యం చేయడంవలన, ఆ శాఖ నైతిక స్థైర్యం మరియు నిర్వహణ సామర్థ్యం తీవ్రంగా దెబ్బతిన్నాయి. ముఖ్యంగా తగినన్ని అలవెన్సులు లేకపోవడం వలన మరియు ఉద్యోగుల బకాయిలను చెల్లించకపోవడం వలన, పోలీస్ శాఖ ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులకు గురిఅయ్యారు. వాహనాల లభ్యత తక్కువగా ఉండటం, గస్తీ వాహనాలకు నిర్వహణ లేకపోవడం మరియు పోలీసు బలగాలను తక్కువ వనరులతో నడిపించడం వలన, వారు ఎంతో ఒత్తిడికి లోనయ్యారు. ఇది ప్రజా అవసరాల కోసం వేగంగా మరియు సమర్థవంతంగా స్పందించే వారి సామర్థ్యానికి ఆటంకం కలిగించింది. సి.సి. కెమెరాల నిర్వహణ వంటి సాధారణ పనులకు కూడా గత ప్రభుత్వం నిధులను అవసరమైనంత మేరకు విడుదల చేయలేదు. ఈ క్లిష్టమైన సమస్యలను గుర్తించిన మా ప్రభుత్వం ఆధునికీకరణ మరియు సమకాలీన సవాళ్లకు ధీటుగా పోలీస్ శాఖను సన్నద్ధం చేయడంపై దృష్టి సారించి ఈ శాఖ సామర్థ్యాలను పునరుద్ధరించడానికి మరియు పెంచడానికి నిర్ణయాత్మక చర్యలు చేపట్టింది.

57. నూతన వాహనాలు మరియు అధునాతన పరికరాల కొనుగోలుకు, మౌలిక వసతుల కల్పనకు మరియు పోలీసు బలగాల ఆధునీకరణకు మా ప్రభుత్వం 62 కోట్ల రూపాయల నిధులను విడుదల చేసింది. పోలీస్ శాఖకు పూర్వ వైభవం తీసుకురావడానికి గౌరవ ముఖ్యమంత్రిగారు సమూల మార్పునకు ఆమోదం తెలిపారు. శ్రీకాకుళం, చిత్తూరు, ప్రకాశం మరియు రాజమహేంద్రవరంలలో కొత్తగా నాలుగు ప్రత్యేక పోలీస్ బెటాలియన్‌లను

ఏర్పాటు చేయడం జరుగుతోంది. అంతేగాక 300 మంది మహిళా సహాయ డెస్క్‌లను మరియు సైబర్ నేరాలను అరికట్టడానికి ప్రతీ జిల్లాలో సైబర్ పోలీస్ స్టేషన్‌లను కూడా ప్రత్యేకంగా ఏర్పాటు చేయడం జరుగుతోంది. మాదకద్రవ్యాల కేసుల సత్వర పరిష్కారానికి రాష్ట్రవ్యాప్తంగా 13 ఫాస్ట్ ట్రాక్ ఎన్.డి.పి.ఎస్. కోర్టులను ఏర్పాటు చేస్తున్నాము. ఆధునికీకరించబడిన మరియు తక్షణమే ప్రతిస్పందించగలిగే సమర్థవంతమైన పోలీసు దళాలను పునర్నిర్మించే దిశగా చేపట్టిన ఈ చర్యలు మా ప్రభుత్వపు నిబద్ధతను సూచిస్తాయి.

58. గత ప్రభుత్వ హయాంలో యువతలో గంజాయి వాడకం విపరీతంగా పెరిగింది. ఆ సమయంలో దేశంలో పట్టుబడిన మాదకద్రవ్యాల మూలాలు మన రాష్ట్రంలో ఉండటం సిగ్గుచేటు. అధ్యక్షా! మాదకద్రవ్యాల విస్తృత వినియోగ వ్యతిరేక కార్యక్రమాలలో భాగంగా మా ప్రభుత్వం **మాదక ద్రవ్యాల వినియోగ వ్యతిరేక టాస్క్ ఫోర్స్‌**ను ఏర్పాటు చేసింది. విద్యార్థులు గంజాయి మరియు పొగాకు వాడకుండా ఉండేందుకు వారిలో అవగాహన పెంచే సమగ్ర కార్యక్రమాలను ప్రవేశపెట్టడం జరిగింది. ఈ మాదకద్రవ్యాలు మరియు పొగాకు వ్యతిరేక కార్యక్రమాలలో క్రియాశీలక పాత్ర పోషించేందుకు ఉన్నత విద్యా సంస్థలలోని 3,172 యూనిట్‌లకు శిక్షణ ఇచ్చేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని గౌరవ సభకు తెలియచేస్తున్నాను. 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను పోలీస్ శాఖకు 8,495 కోట్ల రూపాయల కేటాయింపును ప్రతిపాదిస్తున్నాను.

**పర్యావరణం, అటవీ మరియు శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం**

59. జాతీయ ప్రమాణాలకు దీటుగా పచ్చదనాన్ని మెరుగుపరచడం ద్వారా పౌరులకు సుస్థిర జీవన ఆవాసాల కల్పనకు మా ప్రభుత్వం కృషిచేస్తోంది. ఈ దిశగా **వనం-మనం, ప్రకృతి పిలుస్తోంది, తీర ప్రాంత ఆవాసాల అభివృద్ధికి మడ అడవుల పెంపకం** మొదలైన పథకాల ద్వారా స్థిరమైన ఆదాయ కల్పన జరుగుతోంది. అన్ని శాఖల మరియు వివిధ వర్గాల ప్రజల భాగస్వామ్యం మరియు కేంద్ర, రాష్ట్ర పథకాల నిధుల సమీకరణ ద్వారా ఇది జరుగుతోంది. పరిశుభ్రమైన మరియు ఆరోగ్యకరమైన నగరాల కోసం బహిరంగ ప్రదేశాలలో పచ్చదానాన్ని ఇచ్చే నగర వనాలను నిర్వహించడం మరియు విస్తరించడం ద్వారా వాతావరణ మార్పులను తట్టుకునే నగరాలను అభివృద్ధి చేయడానికి నగరవనం పథకాన్ని మా ప్రభుత్వం అమలు చేస్తోంది. 2024-25 ఆర్థిక సంవత్సరానికిగాను పర్యావరణ, అటవీ, శాస్త్ర, సాంకేతిక శాఖకు 687 కోట్ల రూపాయల కేటాయింపును ప్రతిపాదిస్తున్నాను.

**2022-23 ఖాతాలు:**

60. ఆంధ్రప్రదేశ్ అకౌంటెంట్ జనరల్ వారు ఖరారు చేసిన ఆర్థిక లెక్కల ప్రకారం 2022-23 ఆర్థిక సంవత్సరానికి గాను రెవెన్యూ లోటు 43,488 కోట్ల రూపాయలు మరియు ద్రవ్యలోటు 52,509 కోట్ల రూపాయలుగా చెప్పడం జరిగింది. రెవెన్యూ లోటు మరియు ద్రవ్యలోటు వరుసగా 3.3 శాతంగానూ, 3.98 శాతంగానూ ఉన్నాయి.

**2023-24 సవరించిన అంచనాలు**

61. సవరించిన అంచనాల ప్రకారం, 2023-24 ఆర్థిక సంవత్సరానికి రెవెన్యూ వ్యయం 2,12,450 కోట్ల రూపాయలు కాగా మూలధన వ్యయం 23,330 కోట్ల రూపాయలు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో రెవెన్యూ లోటు దాదాపు 38,682 కోట్ల రూపాయలు కాగా, ఇదే కాలానికి ద్రవ్యలోటు దాదాపు 62,720 కోట్ల రూపాయలు. ఇవి రాష్ట్ర స్థూల దేశీయ ఉత్పత్తి (జి.ఎస్.డి.పి.) లో వరుసగా 2.65 శాతంగానూ మరియు 4.30 శాతంగానూ ఉన్నాయి.

**2024-25 బడ్జెట్ అంచనాలు**

62. 2024-25 ఆర్థిక సంవత్సరానికి, నేను 2,94,427.25 కోట్ల రూపాయల వ్యయాన్ని ప్రతిపాదిస్తున్నాను. ఇందులో రెవెన్యూ వ్యయం అంచనా 2,35,916.99 కోట్ల రూపాయలు మరియు మూలధన వ్యయం అంచనా 32,712.84 కోట్ల రూపాయలు. ఇదే కాలానికి రెవెన్యూ లోటు 34,743.38 కోట్ల రూపాయలు మరియు ద్రవ్య లోటు 68,742.65 కోట్ల రూపాయలుగా ప్రతిపాదిస్తున్నాను. రాష్ట్ర స్థూల దేశీయ ఉత్పత్తి (జి.ఎస్.డి.పి.) లో రెవెన్యూ లోటు 4.19 శాతంగానూ మరియు ద్రవ్యలోటు 2.12 శాతంగానూ ఉండవచ్చు.

**ముగింపు**

63. నేను ముందే చెప్పినట్లుగా మన రాష్ట్ర ప్రగతి పునఃప్రారంభానికి మరియు పునర్నిర్మాణానికి ఈ బడ్జెట్ తొలి మెట్టు. తమతమ కుటుంబాలలోని ప్రతి ఒక్కరికీ ఆరోగ్యం, విద్య, జ్ఞానం, నైపుణ్యం మరియు సంపదలు కలగాలని

ప్రతి కుటుంబం కలలు కంటుంది. ఈ కలలు సాకారం అవ్వడానికి మా ప్రభుత్వం కట్టుబడి ఉంది. మన రాష్ట్ర ప్రజలు వారి ఆశలు నెరవేర్చు-కునేటందుకు అపూర్వమైన తీర్పును ఇచ్చారు. ప్రజలు మేము ఇచ్చిన హామీలపై నమ్మకం ఉంచారు. ఈ హామీలను నిలబెట్టుకోవాల్సిన బాధ్యత మా ప్రభుత్వంపై ఉంది. మా ప్రభుత్వం ముందున్న ఈ సవాళ్లను గౌరవ ముఖ్యమంత్రిగారి నాయకత్వంలో మేము అధిగమించగలమని విశ్వసిస్తున్నాము. స్వర్ణాంధ్రలో జీవించాలనే ప్రజల ఆశలను సాకారం చేయడానికి మా ప్రభుత్వ నిబద్ధతను పునరుద్ఘాటిస్తున్నాను.

**'సరళమైన ప్రభుత్వం - ప్రభావవంతమైన పాలన'**

అనే సూత్రంతో పాలనను క్రమబద్ధీకరించడమే మా ప్రభుత్వ లక్ష్యం.

**స్వామి వివేకానందుడి** స్ఫూర్తిదాయకమైన మాటలతో నా ప్రసంగాన్ని ముగిస్తున్నాను.

**"మనం ఎలా ఉన్నామో దానికి మనమే బాధ్యులం.**
**మనం ఎలా ఉండాలనుకున్నా అలా మనల్ని మనం తయారుచేసుకునే శక్తి మనకుంది.**
**మనం ఇప్పుడు ఉన్నది మన గత చర్యల ఫలితమైతే, భవిష్యత్తులో మనం ఏమి కావాలనుకుంటున్నామో అది మన ప్రస్తుత చర్యల ద్వారా ఖచ్చితంగా నిర్ణయించబడుతుంది.**
**కాబట్టి ఎలా నడుచుకోవాలో మనం తెలుసుకోవాలి."**

ఈ మాటలతో నేను ఇప్పుడు బడ్జెట్‌ను గౌరవసభ ఆమోదం కోసం సమర్పిస్తున్నాను.

***జై ఆంధ్రప్రదేశ్!!***

***జై హింద్!!***